క్లుప్తంగా

ఎలుకల నివారణకు చర్యలు చేపట్టాలి



విషపు ఎర తయారీపై రైతులకు అవగాహన కల్పిస్తున్న విజయ్‌జ్యోతుకుమార్

పగిడ్యాల: వరి సాగు చేసిన రైతులు ఎలుకల నివారణకు తగు చర్యలు తీసుకోవాలని ఏఓ విజయ్‌జ్యోతుకుమార్ సూచించారు. బుధవారం మండలంలోని నెహ్రూనగర్ గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ వరిలో ఎక్కువ శాతం పిలక దశ, కోత దశలో ఎలుకల బెడద ఉంటుందని, పైరును నాశనం చేస్తాయన్నారు. ఎలుకల నివారణకు రైతులు కచ్చితంగా విషపు ఎరలను తయారు చేసుకుని నివారించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు వెంకటరమణ, నూర్జాహాన్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'

బండిఆత్మకూరు: మండలంలోని నారాయణపురం, చిన్నదేవళాపురం గ్రామాల్లో మండల వ్యవసాయ అధికారి స్వాతి ఆధ్వర్యంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ఎం.చంద్రశేఖర్ రెడ్డి, పతంజలి హార్టికల్చర్ ఫీల్డ్ ఆఫీసర్ మౌనిక, రైతులు పాల్గొన్నారు. వరి పొలాలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు.

ఏజీపీగా వెంకటేశ్వర్లు



ఆత్మకూరు: ఆత్మకూరు సీనియర్, జూనియర్ కోర్టు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ (ఏజీపీ) గా వేముల వెంకటేశ్వర్లను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీఓను విడుదల చేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనను ఈ పదవికి ఎంపిక చేసిన స్థానిక న్యాయశాఖ మంత్రి ఫరూక్, శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. ఏజీపీగా ఎంపికైన వేముల వెంకటేశ్వర్లను న్యాయవాదులు గోవిందరెడ్డి, రవికుమార్, కేశవరెడ్డితో పాటు పలువురు అభినందించారు.

నాన్ టీచింగ్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలి

పగిడ్యాల: స్థానిక కేజీబీవీ పాఠశాలలో నాన్ టీచింగ్ పోస్టులైన హెడ్‌కుక్, అసిస్టెంట్ కుక్, అటెండర్, వాచ్‌మెన్ పోస్టులకు అర్హులైన మహిళలు దరఖాస్తు చేసుకోవాలని మండల విద్యాధికారి సుభాన్ బుధవారం ఓ ప్రకటనలో సూచించారు. హెడ్‌కుక్, అసిస్టెంట్ కుక్‌లకు విద్యార్హతతో సంబంధం లేదని, అటెండర్, వాచ్‌మెన్ పోస్టులకు పదవ తరగతి, 7వ తరగతి పాసైన స్థానిక మహిళలు అర్హులన్నారు. ఈ నెల 15వ తేదీలోగా స్థానిక ఎంఈఓ కార్యాలయంలో అభ్యర్థులు దరఖాస్తులు సమర్పించాలన్నారు.

తప్పనిసరిగా విత్తన శుద్ధి చేసుకోవాలి

కొత్తపల్లి: రైతు తప్పనిసరిగా విత్తన శుద్ధి చేసుకోవాలని ఏఓ మహేష్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని నందికుంట గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. సాగు పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. అదేవిధంగా పొలాలను పరిశీలించి చీడపీడల నివారణ, రసాయనాల వాడకం, విత్తన శుద్ధి ప్రయోజనాలు వివరించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకుడు వి శివకష్ణ నాయక్, గ్రామ రెవెన్యూ అధికారి వి కష్టారెడ్డి, గ్రామ నాయకు లు పి. నారాయణ రెడ్డి, టి సమీవుల్లా, టి మధుసూదన్ రెడ్డి, రైతు సోదరులు పాల్గొన్నారు

పిల్లలతో వెట్టిచాకిరీ చేయిస్తే క్రిమినల్ కేసులు

నందికొట్కూరు: బాల కార్మికులతో వెట్టిచాకిరీ చేయించే యాజమానిపై క్రిమినల్ కేసులు నమోదు చేయడం ఖాయమని సీనియర్ సివిల్ జడ్జి ఇందిరా ప్రియదర్శిని హెచ్చరించారు. బుధవారం పట్టణంలోని కోర్టు ఆవరణలో మండల్ లీగల్ సర్వీస్ ఆధ్వర్యంలో ఆపరేషన్ స్వేచ్ఛ బాండెడ్ చైల్డ్ లేబర్ కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని ఆయా దుకాణాలను జడ్జి, న్యాయవాదులు పరిశీలించారు. జడ్జి మాట్లాడుతూ పిల్లలు పని చేస్తునట్లు చూసిన వెంటనే పోలీసులకు, రెవెన్యూ అధికారులకు, కోర్టుకు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో లేబర్ ఆఫీసర్ సమీర్, రెవెన్యూ డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మహానందీశ్వరుడి సన్నిధిలో పూజలు

మహానంది: మహానందీశ్వరస్వామి సన్నిధిలో నంద్యాల జిల్లా టెరిటోరియల్ డీఎఫ్ఓ నాగమునీశ్వరి బుధవారం పూజలు నిర్వహించారు. మహానందికి వచ్చిన ఆమె శ్రీ కామేశ్వరీదేవి, శ్రీ మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. ఆలయ పర్యవేక్షకులు శశిధర్‌రెడ్డి స్వాగతం పలుకగా.. దర్శనం అనంతరం స్థానిక యాగశాలలో ఆలయ వేదపండితులు స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందించారు.

ఇసుకే బంగారమాయే!

- కొత్త ప్రభుత్వం వచ్చాక తీవ్ర ఇసుక కొరత
- అధిక ధరలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్న దళారులు
- గ్రామాలకు ఇసుక తెచ్చేందుకు ఆసక్తి చూపని వైనం
- రూ.10వేలు పెట్టినా దొరకని పరిస్థితి



ఇసుక కొరత వల్ల ఆగిపోయిన ఇంటి నిర్మాణం

బండిఆత్మకూరు: కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత ఇసుక పాలసీ వలన ఇళ్ల నిర్మాణాలు మొదలుపెట్టిన సామాన్యుల పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది. రీచ్‌లల్లో ఇసుక ఉన్నా దళారుల జోక్యం వల్ల సామాన్యులకు ఇసుక అందని ద్రాక్షగా మారింది. యథేచ్ఛగా అక్రమ రవాణా చేస్తూ, అధిక ధరలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అయినా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం ఉచిత ఇసుక అని చెప్పి డబ్బు వసూలు చేస్తున్నప్పటికీ ఇసుక మాత్రం దొరకడంలేదు. బండిఆత్మకూరు మండలంలో రూ.10వేలు పెట్టినా ట్రాక్టర్ ఇసుక లభించని పరిస్థితి.

మితిమీరిన దళారుల జోక్యం

నూతన ప్రభుత్వం ఏర్పడిననాటి నుంచి ఇసుక దళారులు సిండికేట్‌గా మారి వేరే ప్రాంతాల్లో ఎక్కు వ రేటుకు అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాలంలో మండలంలో బండిఆత్మకూరు, సంతజూటూరులో ఇసుక డిపోల ను ఏర్పాటు చేశారు. అయితే కొత్త ప్రభుత్వం వచ్చా క అక్కడా ఇసుక దొరకడంలేదు. గత రెండు వారా లుగా మండల ప్రజలకు ఇసుక దొరకడంలేదు, దొరికినా పోలీసులు కేసులు రాస్తున్నారనే నెపంతో డబుల్ రెట్లకు కొనవలసిన పరిస్థితి నెలకొందని ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్న యజమానులు వాపోతున్నారు. కళ్లెదురుగా ఇసుక అక్రమ రవాణా యా థేచ్ఛగా సాగుతోందని, సామాన్యులకు మాత్రం అందడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తాపీమేస్త్రీలకు దొరకని పనులు

సాధారణంగా పల్లెటూర్లలో బేల్దారులకు గిరాకీ ఎక్కువ. కానీ, ఇసుక కొలత వల్ల మండల వ్యాప్తంగా గృహ నిర్మాణాలు ఆగిపోయి బేల్దారులకు పని దొరక్క నానా అగచాట్లు పడుతూ, హమాలి పనికి వెళ్తున్నారు. ఎన్నికలకు ముందు స్థానికంగా ఉండే ఇసుక డిపోల వద్ద ట్రాక్టర్ రూ.నాలుగు వేలకు దొరికేది. ఎన్నికలయ్యాక అదే ట్రాక్టర్ రూ.6000 అయ్యింది. ప్రస్తుతం ట్రాక్టర్ ఇసుక రూ.పది వేలు పెట్టి కొందామన్న దొరకడం లేదు. వైఎస్సార్ జిల్లా నుంచి ఇసుక తీసుకొస్తున్న దళారులు పల్లెలకు ఇసుకను చేర్చడానికి సుముఖంగా లేకపోవడం వల్ల తాపీమేస్త్రీలు, భవన నిర్మాణ కార్మీకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాను అడ్డుకొని, సామాన్యులకు ఇసుకను అందేలా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

గత ప్రభుత్వ హయాంలో రూ.4వేలకే దొరికేది



4 నెలల క్రితం ఎపుడు కావాలంటే అపుడు ట్రాక్టర్ ఇసుక రూ.4,000కే ఇసుక డిపోల నుంచి ఇంటి వద్దకే వచ్చేది. కానీ మంగళవారం రూ.10వేలు పెట్టి కొందామన్నా ఇసుక దొరకడం లేదు. ఇసుక ఎక్కడికి పోతుందో ఎవరికీ తెలియడం లేదు. ఇసుకాసురుల నుంచి కాపాడి సామాన్యులకు చేరే విధంగా ప్రభుత్వం, అధికారులు చర్యలు తీసుకోవాలి.

– తెలుగు. నాగబాబు, సంతజుటూరు

పని కోసం నంద్యాలకు వెళ్తున్నాం



పల్లెల్లో ఇసుక అందుబాటులో లేకపోవడంతో సామాన్యులు ఇల్లు కట్టుకోవటం నిలిపివేశారు. అందువల్ల బేల్దారుల మందరం నంద్యాల టౌన్‌కి పనికి వెళ్లాల్సి వస్తుంది. దయచేసి పల్లెలకు కూడా ఇసుక సరఫరా అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుకుంటున్నామన్నారు.

– ముల్లా. ఆషిఫ్ బండి ఆత్మకూరు

శ్రీగిరికి దసరా శోభ



శ్రీశైల ఆలయంలో వివిధ రకాల పుష్పాలతో శోభయామానంగా అలంకరించిన ఆలయం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో దసరా మహోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా ఉభయ దేవాలయాలను దేవస్థాన అధికారులు ప్రత్యేక పుష్పాలతో అలంకరించారు. ఆలయ ధ్వజస్తంభాలు, ఆలయ ప్రాంగణాలు, ప్రధాన ద్వారాలు వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించడంతో దసరా మహోత్సవాల శోభను సంతరించుకుంది.



పుష్పాలతో అలంకరించిన ధ్వజస్తంభం

రైతుల ఆర్థికాభివృద్ధికి కృషి చేయాలి



అరటి రైతుతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

మహానంది: వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులు రైతుల ఆర్థికాభివృద్ధికి కృషి చేయాలని, ప్రభుత్వం నుంచి వచ్చే ప్రోత్సహకాలు వారికి అందేలా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా అన్నారు. మహానంది మండలంలో పంట నమోదు ప్రక్రియపై బుధవారం ప్రత్యేక తనిఖీ (సూపర్ చెక్) నిర్వహించారు. జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో అరటిపొలాలను సందర్శించి, పంట నమోదు చేసిన సర్వే నంబర్లను పరిశీలించారు. అరటి పంట సాగు చేస్తున్న తీరు, సాగు, పెట్టుబడులు, లాభ నష్టాలపై రైతులను అడిగి తెలుసుకున్నారు. మహానంది మండలంలో ప్రధానంగా సాగు చేస్తున్న సుగంధం, పచ్చ అరటి రకాలతో పాటు యాళక్కి రకం సాగు వివరాలపై ఆరా తీశారు. ఇతర రాష్ట్రాల్లో ఉన్నట్లు మన ప్రాంతంలో రోప్ సిస్టం ద్వారా పంట దిగుబడిని బయటికి తీసుకొచ్చేందుకు అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని రైతులు రమణయ్య, లక్ష్మయ్యలు కలెక్టర్‌ను కోరారు. దీంతో పాటు ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లలో అమలవుతున్న మధ్యాహ్న భోజనం పథకంలో జీ-9 రకం అరటి పండ్ల స్థానంలో మహానంది మండలంలో పండించే సుగంధం రకాలు చేర్చాలని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. వ్యవసాయ అధికారి నాగేశ్వరరెడ్డి, ఉద్యానశాఖ అధికారి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఔత్సాహికుల్లో నిరాశ



దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎక్సైజ్ పోలీసులు

ఆత్మకూరురూరల్: ప్రభుత్వ మద్యం దుకాణాలు దక్కించుకునేందుకు దరఖాస్తు చేసుకుని లాటరీలో పాల్గొనేందుకు ఉవ్విళ్లూరాల్సిన ఔత్సాహికులు అధినాయకుల హుకుంతో మౌన ముద్ర దాలుస్తుండడంతో ఈ ప్రక్రియ మంద కొడిగా సాగుతోంది. ఆత్మకూరు ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో బుధవారం నాటికి 13 షాపులకు గాను కేవలం 118 దరఖాస్తులు మాత్రమే రావడం వెనుక అధికార పార్టీ అధినాయకుల కోటరీ రింగ్ మతలబు కనపడుతున్నట్లు జనం చెవులు కొరుక్కుంటున్నారు. శ్రీశైలం నియోజకవర్గంలోని వెలుగోడు మండలంలోని మూడు షాపులకు గాను కేవలం 9, ఆత్మకూరు రూరల్‌లో 2 షాపులకు 8 దరఖాస్తులే రావడమే ఇందుకు నిదర్శనం. ఎక్సైజ్ పోలీసులు ఔత్సాహికులను దరఖాస్తు చేసుకునేందుకు ప్రతి మండలంలో మోటివేట్ చేస్తున్నప్పటికి పరిస్థితి మందకొడిగా ఉండడంతో ఈ నెల 11 వరకు దరఖాస్తు చేసుకునేందుకు గడువు కూడా పెంచారు. ఆత్మకూరు పట్టణానికి చెందిన కూటమిలోని భాగస్వామ్య పక్షానికి చెందిన ఓ నాయకుడు షాపుల కోసం రెండు దరఖాస్తులు పెట్టుకుని, మరిన్ని దరఖాస్తులు చేయడానికి వెళుతున్నాడని తెలియడంతో అతన్ని సైతం ఇక చాలని అధినేతలు హుకుం జారీ చేసినట్లు తెలిసింది.

ట్రాఫిక్ రూల్స్‌ను పాటించాలి



మాట్లాడుతున్న ఆత్మకూరు డీఎస్పీ రామంజినాయక్

ఆత్మకూరు: వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలని ఆత్మకూరు డీఎస్పీ రామంజినాయక్ సూచించారు. బుధవారం పట్టణంలో ఆటో డ్రైవర్లు, పట్టణ ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ యువత ట్రాఫిక్స్ రూల్స్ పాటించకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఎక్కువగా యువతే ప్రమాదాల బారిన పడుతున్నారని తెలిపారు. బైకులపై ప్రయాణించే వారు హెల్మెట్ వాడాలని, ఇన్సూరెన్స్ తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. త్రిపుల్ రైడింగ్ వెళితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు ఇళ్లకు తాళం వేసి ఇతర ప్రాంతాలకు వెళితే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఇంట్లో విలువైన వస్తువులు, బంగారం, నగదును ఉంచవద్దని సూచించారు. కార్యక్రమంలో సీఐ సుధాకర్‌రెడ్డి, పోలీసులు, ప్రజలు పాల్గొన్నారు.

ఇదెక్కడి న్యాయం?

- అనుమతులున్నా.. బోట్లను ఎందుకు తిరగనివ్వడం లేదు
- జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి



సిద్దేశ్వరం ఘాటు వద్ద బోటును పరిశీలిస్తున్న జెడ్పీటీసీ సోమల సుధాకర్ రెడ్డి

కొత్తపల్లి: అన్ని అనుమతులు ఉన్న కృష్ణానదిలో పేదల బోట్లను ఎందుకు తిరగనివ్వడం లేదని జెడ్పీటీసీ సభ్యుడు సోమల సుధాకర్ రెడ్డి అధికారుల తీరును ప్రశ్నించారు. బుధవారం మండల పరిధిలోని సిద్దేశ్వరం ఘాట్ బోటును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృష్ణా నదిలో బోటు తిప్పుకునేందుకు అప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం, పోర్టు అధికారుల నుంచి అన్ని అనుమతులున్నా అధికారులు అడ్డంకులు సృష్టిస్తున్నారని విమర్శించారు. టీడీపీ నాయకులు చెప్పినట్లు వ్యవహరిస్తూ పేదలకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. అన్ని అనుమతులు ఉన్నా బోటు నిర్వాహకులపై బైండోవర్ కేసులు బనాయించడం ఎంత వరకు న్యాయమని ప్రశ్నించారు. టీడీపీ నాయకుల ఒత్తిళ్ల మేరకు అనుమతులు లేనప్పటికీ కొందరు కృష్ణా నదిలో బోట్లు తిప్పుతున్నారని, వారిని పట్టించుకోకుండా అనుమతి ఉన్న బోట్ల నిర్వాహకులపై అధికారులు కేసుల పేరిట సతాయించడం సమంజసం కాదన్నారు. విషయాన్ని తహసీల్దార్ ఉమారాణిని కలిసి వివరించినా తాము వేరే పనుల్లో బిజీగా ఉన్నామంటూ దాటవేసే సమాధానం చెప్పడం విచారకరమన్నారు. జిల్లా ఉన్నతాధికారులు చొరవ చూపి పేదల జీవనాధారమైన బోటును తిప్పుకునేందుకు అవకాశం కల్పించాలని కోరారు. ఆయనతోపాటు సర్పంచ్ బాలఎల్లయ్య, కోఆప్షన్ సభ్యుడు షేక్.మహమ్మద్ గౌస్, బోటు నిర్వాహకులు ఉన్నారు.

సామూహిక ఎలుకల నివారణతో మేలు



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ, ఏఓ

వెలుగోడు: సామూహిక ఎలుకల నివారణ చేపట్టి తమ పంటలను కాపాడుకోవాలని ఆత్మకూరు ఏడీ ఆంజనేయ సూచించారు. బుధవారం వెలుగోడు మండలం రేగడగూడూరు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేశారు. సామూహిక ఎలుకల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. ఏడీఏ మాట్లాడుతూ విత్తనం వేసింది మొదలు ధాన్యం విక్రయించే వరకూ ఎలుకలు వరి పైరుకు, ధాన్యానికి అపార నష్టం కలిగిస్తాయన్నారు. వీటిని సమర్థవంతంగా నివారించేందుకు వ్యవసాయ శాఖ సూచించిన సమగ్ర సస్యరక్షణ పద్ధతులను పాటించాలని రైతులకు సూచించారు. జింక్ పాస్ఫైట్, బ్రోమోడైలోన్ లేదా అల్యూమినియం పాస్ఫైట్ రసాయనాలను ఉపయోగించి ఎలుకలను సామూహికంగా నివారించవచ్చన్నారు. ప్రస్తుతం బ్రోమోడైలోన్ మందును 100 శాతం రాయితీపై రైతు సేవా కేంద్రాలలో సరఫరా చేస్తున్నారని చెప్పారు. ఏఓ పవన్ కుమార్ మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో రైతులకు మందు ఉచితంగా పంపిణీ చేస్తామని, 5 శాతం మందులో రైతులు 90 శాతం నూకలు, 5 శాతం నూనె కలిపి పొట్లాలుగా కట్టి ఎలుకల బొరియల్లో వేయాలని సూచించారు. ఆత్మకూరు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నారాయణరెడ్డి, రైతు సేవా కేంద్రం సిబ్బంది లక్ష్మీప్రసన్న, రామకృష్ణ పాల్గొన్నారు.

వైభవంగా అమ్మవారి గ్రామోత్సవం

వెలుగోడు: పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారు సరస్వతి దేవి అలంకరణలో దర్శనమిచ్చారు. అమ్మవారికి పురోహితులు ప్రత్యేక పూజలు నిర్వహించి వచ్చిన భక్తులందరికీ తీర్థ ప్రసాదాలు అందజేశారు. కన్యకా పరమేశ్వరి ఆలయం నుంచి ఆర్యవైశ్యులు అమ్మవారి బిందె కలశంతో వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. అమ్మవారికి ఆర్యవైశ్యులు తాళ్లూరి సంజీవరాయ ప్రసాద్ రూ.60 వేల విలువచేసే వెండి టెంకాయ, వెండి మామిడాకులు బహూకరించారు. గ్రామోత్సవంలో ఆర్యవైశ్యులు లాలం సుధాకర్, నాగ పుల్లయ్య, శ్రీనివాసులు, బల్లాని వెంకట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా వేల్పనూరు అంకాల పరమేశ్వరి దేవి ఆలయంలో కాళరాత్రి దేవి అలంకరణలో అమ్మవారిని అలంకరించారు.



వెలుగోడులో అమ్మవారి కలశంతో గ్రామోత్సవం నిర్వహిస్తున్న ఆర్యవైశ్యులు



సరస్వతీ దేవికి మంగళహారతి ఇస్తున్న కాకునూరు పీఠాధిపతి



సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహిస్తున్న దృశ్యం

సరస్వతీ నమస్తుభ్యం



ఆత్మకూరు కన్యకా పరమేశ్వరి ఆలయంలో..



క్వార్టర్స్‌లోని సరస్వతీ మాత ఆలయంలో ..



ఓంకారంలో సరస్వతిదేవి అలంకారం



నందికొట్కూరులో వాసవీమాత

కొత్తపల్లి: దేవి శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా ఏడవ రోజు బుధవారం శ్రీ సరస్వతి దేవి అలంకరణలో కొలను భారతీదేవి భక్తులకు దర్శనమిచ్చారు. రాష్ట్రంలో ఏకైక సరస్వతి దేవాలయం కొలనుభారతి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఆలయ ప్రాంగణంలో సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. కానూరు శారదాపీఠం పీఠాధిపతి శివయోగేంద్ర సరస్వతి కొలను భారతీదేవి ఆలయాన్ని సందర్శించి సరస్వతి దేవికి విశేష పూజలు చేశారు. అమ్మవారిని ఎమ్మెల్యే జయసూర్య దర్శించుకున్నారు.

సాక్షినెట్‌వర్క్: బండిఆత్మకూరు మండలంలోని ఓంకారేశ్వరాలయంలో గంగ ఉమాదేవి వారు, ఆత్మకూరు పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి, చౌడేశ్వరిదేవి, పార్వతీదేవి అమ్మవార్లను సరస్వతిదేవిగా అలంకరించారు. నందికొట్కూరు శ్రీ వాసవి కన్యకా పరమేశ్వర ఆలయంలో, పాములపాడు చౌడేశ్వరీ ఆలయంలో, జూపాడుబంగ్లా క్వార్టర్స్‌లోని సరస్వతీమాత ఆలయంలో, తాటిపాడులో అమ్మవారు సరస్వతీదేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. మిడుతూరు శ్రీ కన్యకాపరమేశ్వరీ ఆలయంలో కన్యకాపరమేశ్వరీ అమ్మవారు, శ్రీ చౌడేశ్వరీ దేవాలయంలో చౌడేశ్వరీ దేవి అమ్మవారు సరస్వతీ దేవీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

ఒకే యాప్‌గా మార్చాలి

నందికొట్కూరు: అంగన్‌వాడీ కేంద్రాలకు సంబంధించిన యాప్‌లన్నీ ఒకటిగా మార్చాలని ఆంధ్రప్రదేశ్ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పేర్ యూనియన్ నాయకురాలు మదార్‌బీ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో సీడీపీఓ కోటేశ్వరమ్మకు నాయకురాళ్లు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ సెంటర్ నిర్వహణకు లబ్ధిదారుల లిస్ట్‌ను నమోదు చేయడానికి మూడు యాప్‌ల ద్వారా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకురాళ్లు రమణమ్మ, సులోచనమ్మ, నిర్మలమ్మ, సునీత తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: అంగన్‌వాడీ సెంటర్ నిర్వహణ యాప్‌లను కలిపి ఒకే యాప్‌గా మార్చాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు కార్యదర్శి మంజుల, నాయకురాలు లక్ష్మీదేవి డిమాండ్ చేశారు. బుధవారం అంగన్‌వాడీల సమస్యలపై ఐసీడీఎస్ అధికారికి వినతిపత్రం అందించారు.

5న ప్రజా సమస్యల పరిష్కార వేదిక

మిడుతూరు: స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద 15న ఉదయం 10 గంటలకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ దశరథరామయ్య బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే గిత్తా జయసూర్య హాజరవుతారని, మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ రెవెన్యూ అధికారులు హాజరుకావాలని సూచించారు.

మాస్టర్ ప్లాన్ అమలుకు ప్రణాళిక



మాస్టర్‌ప్లాన్‌పై నిపుణులతో చర్చిస్తున్న ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి

మహానంది: మహానంది దేవస్థానం అభివృద్ధికి, మాస్టర్ ప్లాన్ అమలుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు ఆలయ ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి తెలిపారు. మహానంది దేవస్థానం కార్యాలయంలో బుధవారం హైదరాబాద్ నగరానికి చెందిన ఆర్కిటెక్చర్ నిపుణులు ఆర్‌జే గణేష్, అర్బన్ డిజైనర్ నిఖిలాశ్రీలతో అభివృద్ధి పనులపై చర్చించారు. ఈఓ మాట్లాడుతూ మహానందీశ్వరస్వామి దర్శనార్థం వచ్చే భక్తులు రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో భవిష్యత్ తరాలను దృష్టిలో ఉంచుకుని ఆలయ అభివృద్ధికి పాటుపడుతున్నట్లు చెప్పారు. అందులో భాగంగా ఆలయ పరిసరాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు, చేపట్టాల్సిన పనులపై క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వారి వెంట ఏఈఓ మధు, ఆలయ పర్యవేక్షకులు శశిధర్‌రెడ్డి, ఇంజనీరింగ్ విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

వర్షం కురిసి..ధాన్యం తడిసి



మొక్కజొన్న ధాన్యంలో నిలిచిన వర్షపునీటిని బట్టతో అద్ది బకెట్‌లో పిండుతున్న రైతులు

పాములపాడు: వర్షం అన్నదాతకు కన్నీళ్లు మిగులుస్తోంది. పంట చేతికందిన సమయంలో కురుస్తున్న వర్షాలు అన్నదాతకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. బుధవారం మండలంలో ఓ మోస్తారు వర్షం కురిసింది. ఆరబోసిన మొక్కజొన్న దిగుబడులు తడిసిపోయాయి. పట్టాట్టలు కప్పుకునే సమయం కూడా లేకపోవడంతో దిగుబడులు తడిసిముద్దయ్యాయి. దీంతో వ్యాపారులు ధాన్యాన్ని మరీ తక్కువ ధరకు అడుగుతారనే రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ఇదిలా ఉంటే ఇంకా కోత కోయని రైతుల పరిస్థితి మరో విధంగా ఉంది. వర్షాల మూలంగా పొలాలు తడితో ఉండటంతో కోత మిషన్లు పొలాల్లోకి పోలేని పరిస్థితి. పొలం ఆరేదెన్నడు, కోత కోసేందెన్నడు, ధాన్యం ఎండేదెన్నడు, తూకం వేసేదెన్నడూ, రబీ సాగు మొదటుపెట్టేదన్నడు అనే ప్రశ్నలు ఎదురవుతున్నాయి. ఏదిఏమైనా ప్రస్తుతం కురుస్తున్న రైతన్నను తీవ్ర నష్టాన్ని మిగిలుస్తోంది.

దంచి కొట్టిన వర్షం



బండిఆత్మకూరులో ఈదురు గాలులతో నేలకొరిగిన వరిపైరు

ఆత్మకూరు: పట్టణంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో బుధవారం ఊహించనివిధంగా వర్షం దంచి కొట్టింది. భారీ వర్షం కురవడంతో కరివేన, నల్ల కాల్వ, బాపునంతపురం, కొత్త రామాపురం గ్రామాల్లో ఆరబోసిన మొక్కజొన్న దిగుబడులు తడిసి ముద్దయ్యాయి. దీంతో రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు. మొక్కజొన్న రైతులతో పాటు ఇటీవల సాగుచేసిన మిరప పంట రైతులు కూడా ఇబ్బందులు పడుతున్నారు.

నేలకొరిగిన పంటలు

బండిఆత్మకూరు: మండలంలో బుధవారం ఉదయం నుంచి ఈదురు గాలులతో కూడిన వర్షం కురుస్తుండటంతో మండలంలోని పార్నపల్లి, బి. కోడురు, వెంగళరెడ్డి పేట గ్రామాల్లో కొన్ని చోట్ల వరి పంట నేలకొరిగింది. దీంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. అధికారులు పంట నష్టాన్ని అంచనా వేసి పరిహారమివ్వాలని విజ్ఞప్తి చేస్తున్నారు.